# సత్య వాక్కు

THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్య వాణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందియున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 20 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలో మేము ముద్రించబోవునట్టి పుస్తకములను, సత్యవాక్య మాస పత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 10/-లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYAVANI**
(P.O. Box 80) Seshagiri Rao St.,
KAKINADA - 533 004

గమనిక :- మీరు M. O. పంపునప్పుడుగాని, మీ అడ్రసులో మార్పు వచ్చినప్పుడుగాని మీసత్యవాక్య నంబరును దయచేసి తెలియ జేయుండి.


Rajan Electric Press, Kakinada.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE

*Managing Editor* JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **5** డిసెంబరు **1982** సంపుటి **3**


# సంపాదకీయము

## మార్పుజెందే లోకంలో మార్పు జెందనివి

*(The unchangeable in a changing world)*

అనిశ్చయమైన లోకంలో మనం జీవించుచున్నాము. గత కొద్ది సంవత్సరాల్లోను జీవితంలో జరిగిన ప్రతి విధమైన మార్పునుగూర్చి ఆలోచించుము. ఏదో ఒకవిధంగా ప్రతీది మార్పుజెందింది. అంతే కాదుగాని వచ్చే సంవత్సరాల్లో కలిగే మార్పునుగూర్చి ఆలోచించుము. మనకొరకు దాచి యుంచబడిన వాటిని గూర్చి ఆలోచించేటప్పుడు మనలో ఉత్సాహము, ఉద్రేకము కలుగవచ్చు. భవిష్యత్తులో కలిగే మార్పులు మనకేలాగు ఉంటాయో తెలియదుగనుక అవి భయమును కూడ పుట్టించవచ్చు.

మానవుల మతాల్లోకూడా అనేక మార్పులు కలుగుచుయున్నవి. దేవుండ్లు వచ్చి వెళ్లుచూ యున్నారు. మతసంబంధ పుస్తకములు, ప్రమాణములు, శిక్షణలు, విశ్వాస ప్రమాణ గ్రంథములు తరచు సరిదిద్దబడుచు యున్నాయి. క్రొత్త సంఘాలు తరచు కనబడుచు

యున్నవి. ఏదో ఒక క్రొత్త బోధో లేక సిద్ధాంతమో వినబడుచునే యున్నది. క్రీస్తు రాకడకొరకు తేదీలు నిర్ణయించడం, వాటిని నిలుపుకో లేకపోవడం జరుగుచునే యున్నది. దీని సంతటిని చూచి కొందరు క్రైస్తవ్యాన్నే విసర్జించడం జరుగుచున్నది. మరికొందరు తబ్బిబ్బు లగుచున్నారు, నిరుత్సాహ పడుచున్నారు, విభజింపబడి యున్నారు. ఇంకా కొందరు దీనికి పరిష్కారమార్గం దొరుకుతుందని తలంచి వేరే మతాలకు పోవుచున్నారు.

ఇవన్నియుకూడ అనిశ్చలంగా యుండి మనకు ఆందోళన కలిగించుచున్నను, మార్పుజెందని కొన్ని సంగతులంటూ యున్నవని తెలిసికొనుట ఎంత సంతోషమో గదా. ఇది మనకు విశ్వాసాన్ని, నిర్ధారణను ఇచ్చుచున్నది. దేవుడు, యేసుక్రీస్తు, పరిశుద్ధాత్ముడు, బైబిలు, సువార్త, సంఘము, క్రైస్తవ్యము అను వాటిని గూర్చి మనము చెప్పుకొనుచున్నాము. యివి నిత్యసంగతులు.

సజీవుడైన ఒకే ఒక్క నిజదేవుడున్నాడు. ఆయన ఈ లోకమును అందలి సమస్తాన్ని సృజించాడు. ఆయన ఎల్లప్పుడు ఉన్నాడు; ఎల్లప్పుడు ఉండును. ఆయన సమస్తాన్ని చూచును, సమస్తాన్ని ఎరుగును మరియు సర్వశక్తి గలవాడు. ఆయన ఆత్మయై యున్నాడు (యోహాను 4:24). ఆయన ప్రేమయై యున్నాడు (1 యోహాను 4:8). ఆయన అబద్ధమాడ జాలడు (హెబ్రీ 6:18); శోధింపబడనేరడు (యాకోబు 1:13). దేవునియొక్క స్థిరమైన పునాది సిలకడగా యున్నది యని పౌలు చెప్పెను (2 తిమో 2:19). అంటే ఆయన మార్పు జెందని దాని యర్థము. ఆయన ఎందుకు మార్పు జెందాలి? ఆయనే దేవుడు.

ఒకేఒక్క ప్రభువున్నాడు. ఆయన సజీవుడైన దేవుని కుమారుడగు యేసుక్రీస్తు. ఆయన దైవత్వంలో (త్రిత్వంలో) ఒక వ్యక్తి (కొలస్స 2 : 9). ఆయన ఆదిలో దేవునితో యుండెను (ఆది 1 : 26) ఆయన అద్భుతరీతిగా ఈలోకమందు జన్మించెను (యోహాను 3:16,17)

ఆయన సంఘాన్ని నిర్మించెను (మత్తయి 16 : 18); దానికి ఆయనే శిరస్సు, రక్షకుడును (కొలస్స 1:18; ఎఫెసీ 5:23). "యేసుక్రీస్తు నిన్న, నేడు ఒక్కటే రీతిగ యున్నాడు; అవును, యుగయుగములకు ఒక్కటే రీతిగా ఉండును" అని హెబ్రీ పత్రిక లేఖకుడు లిఖించాడు (హెబ్రీ 13:8). పాపులను రక్షించుటకు క్రీస్తు ఈలోకానికి వచ్చాడు గనుక, మానవుడు ఇంకా నశించిపోవుచునే యున్నాడు గనుకి, ఆయన ఇంకా ఆత్మలను రక్షించుచునే యున్నాడు. ఆయన ఎందుకు మారాలి? ఆయన మారవలసిన పని యేమున్నది? ఆయన ఇంకా దేవుని కుమారుడే (యోహాను 20:31), రక్షకుడే (1 తిమోతి 4:10), ఈ లోకానికి నిరీక్షణ ఆయనే (కొలస్స 1:27). ఇహపరముల యందు ఆయనకు సర్వాధికారమున్నది (మత్తయి 28:18). ఆయన నేడు జీవించుచున్నాడు, మరియు ఈలోకానికి తీర్పు తీర్చడానికి ఒక దినమందు రాబోవుచున్నాడు (యోహాను 14:1-3).

పరిశుద్ధాత్ముడు ఎల్లప్పటివలె సజీవుడై యున్నాడు. అపొస్తలులు, మరికొందరు అద్భుతములుచేయు శక్తిని వారికి ఆయనే యిచ్చి యున్నాడు (అపొ.కా. 2:1-4; అపొ.కా. 6). వాక్యాన్ని ఆయనే యిచ్చాడు (2 పేతురు 1:21). ప్రతి క్రైస్తవునిలోను ఆయన ఈనాడు జీవించుచున్నాడు (అపొ.కా. 2:38). ఆయన మనకొరకు విజ్ఞాపన చేయును (రోమా 8:26). ఆయన మార్పుజెందలేదు, మార్పుజెందడు. ఆయన ఎందుకు మార్పుజెందాలి?

బైబిలు మార్పు జెందదు. అది మొదటి శతాబ్దము చివరి భాగంలో ముగించబడింది; స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణ నియమమని చెప్పబడింది (యాకోబు 1:25). అది అంతయు దైవావేశము వలన కలిగింది (2 తిమో 3:16, 17). దానికి మనము కలుపరాదు, దానినుండి తీసివేయరాదు, దానికి బదులు ఇంకోదాన్ని యుంచరాదు

(ప్రకటన 22:18, 19; గలతీ 1:6-9). మనము వాక్యాన్ని బట్టి ప్రవర్తించువారై యుండాలి (యాకోబు 1:22). ఒకానొక దినమందు అది మనకు తీర్పు తీర్చును (యోహాను 12:48). అది ఆదిమ హెబ్రీ గ్రీకు భాషలనుండి గత సంవత్సరాలలో అనేక సార్లు తర్జుమా చేయబడింది, నిజమే. కొన్ని తర్జుమాలు సరిగా యుండకపోవచ్చును. గాని మనము పవిత్రమైన దేవుని వాక్యాన్నే కలిగి యుండునట్లు ఆదిమ హెబ్రీ గ్రీకు భాషలనుండి ఏభాషలోనికైనా తర్జుమా చేసికొనుట ఎప్పుడు సాధ్యమే. ఈ విధముగా మనము సత్యవాక్యమైన దేవుని వాక్యాన్ని కలిగి యుండగలము (యోహాను 17:17; 8:32). గత సంవత్సరాలలో బైబిలుకు అనేక శత్రువు లుండిరి, నిజమే. దాని శత్రువులు మాయమై పోయారుగాని బైబిలు ఇంకా నిలిచేయున్నది. అందువలన అది నిత్యము నిలుచుండునదని గ్రహించి దానిని నీవు చదివి, ధ్యానించి దాన్ని వెంబడించవచ్చు (మత్త 24:35).

క్రీస్తు సువార్త మార్పులేనిదై యున్నది. యేసుక్రీస్తు పాపుల కొరకై చనిపోయి, సమాధి చేయబడి, మానవుడు రక్షింపబడి రాబోయే లోక నిరీక్షణ కలిగి యుండునట్లు పునరుత్థాను డాయెనను శుభవార్త అది (రోమా 10:15). సువార్తను లోకమంతటా సర్వ సృష్టికి చాటింపవలెనని క్రీస్తు తన అపొస్తలుల నాజ్ఞాపించెను. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును; నమ్మనివానికి శిక్ష విధించబడును" అని ఆయన చెప్పెను (మార్కు 16:15, 16). ఈ నాటివరకు అది మార్చబడలేదు. సరిగదా ఈ లోకము నిలిచి యున్నంతవరకు అది మార్చబడదు. మానవుడు రక్షింపబడాలంటే క్రీస్తు అతనికి కోరేది యిది. అప్పటివలె ఇప్పుడును మానవుడు పాపియే. గనుక రక్షణ షరతులను దేవుడు ఎందుకు మార్చును? రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది (రోమా 1:16, 17). సువార్త శక్తిని అనేకులు నిరాకరించినను, అనేకులు దాన్ని మార్చడానికి ప్రయత్నించి

నను, అది ఎల్లప్పుడు ఉన్న రీతిగనే యున్నది. దాన్ని నమ్మి లోబడిన వారు రక్షింపబడుదురు. దాన్ని నమ్మనివారు నశింతురు.

బైబిలులో మనము చూడగల ఒకేఒక్క సంఘమే ఈనాడును నిలిచియున్న సంఘము. తాను నిర్మింతునని క్రీస్తు వాగ్దానము చేసిన సంఘమది (మత్తయి 16:18). పెంతెకొస్తు దినమున సువార్త ప్రకటింపబడగా ఇంచుమించు మూడువేలమంది దాన్ని విశ్వసించి, తమ పాపముల విషయమై మారుమనస్సు పొంది, రక్షింపబడునట్లును, ప్రభువుచే సంఘముతో చేర్చబడునట్లును బాప్తిస్మము పొందినవారితో సమకూడిన సంఘమది (అపొ. కా. 2). దాని పునాది క్రీస్తు (1 కొరింథీ 3:11), దాని రక్షకుడు క్రీస్తు (ఎఫె. 5:23), దాని శిరస్సు క్రీస్తు (ఎఫెసీ 1:22, 23). ఒక సంఘముగా అది క్రీస్తుపేరు ధరించుకొనును (రోమా 16:16), మరియు దాని సభ్యులు క్రైస్తవులని యనబడుదురు (అపొ. కా. 11:26). ఈ రూపురేఖలను కలిగియుండని ఏ సంఘమైనను క్రీస్తు సంఘము కానేరదు. ఈ సంఘము మాత్రమే క్రీస్తుయొక్క ఆత్మీయ శరీరము, ఆయన వధువు, దేవునియొక్క ఇల్లు, దేవుని రాజ్యమైయున్నది.

క్రైస్తవ్యము నేటి మానవునికి దేవుని మార్గమై యున్నది. అది ఇంచుమించు రెండువేల సంవత్సరములనుండి యున్నది. దాని బోధలు, సూత్రములు, ఆచరణ ఈ కాలమంతటిలోను మార్పులేక యున్నవి. దానిలో ఆరాధన, మానవునికి యితరులతోను, తన సృష్టికర్తయైన దేవునితోను గల సంబంధము మిళితమై యున్నది (యోహాను 4:24; మత్తయి 5–7). మానవుడు జీవించుట ఎట్లో మరణించుట ఎట్లో అది బోధించును. రాబోయే జీవితానికి ఒకని సిద్ధపరచే మార్గమది. అది మార్చబడనవుసరం లేదు. అది దేవునివలన కలిగినది గనుక మార్చబడదు.

దేవునిగూర్చి, మార్చబడని ఆయన మార్గమునుగూర్చి యున్న సూత్రములనేకము లున్నవి. తప్పుచేసినవాడు మానవుడు గనుక

మార్చబడవలసినది అతడే. క్రీస్తునందతడు విశ్వాసముంచి విధేయు ద్వారా తన జీవితాన్ని మార్చుకొన్నప్పుడు అతడు దేవుని కంగీకార యోగ్యుడగును. తమ చిత్తానికనుగుణంగా యుండులాగున ప్రభువు మార్గాన్ని మార్చుటకు యత్నించుట నాశనకరమగును. అనేకులు ఈలాగున చేసి ఆయనను వెంబడించుటకంటె ఆయనను ఎదురాడిరి.

మార్పులేని దేవుని హస్తమును పట్టుకొని నీవు నడిచినయెడల ఆయన నిన్ను ఎన్నడు విడువడు, ఎడబాయడు. దేవునిగూర్చి యున్న ప్పుడు మనం ఆయన కుమారుడైన క్రీస్తునుగూర్చి ఆయన చిత్తాన్ని గూర్చి చెప్పుకొనుచున్నామని గ్రహించుకోవాలి. ఆయన చిత్తము దృఢమైనది. మిగతాదంతయు విఫలమగును. భూమ్యాకాశములు గతించిపోయే దినమొకటి వచ్చుచున్నది. మనము ప్రభువుకు చేసేది మాత్రమే నిలుచును.

---

## మార్పు జెందుటలో పరిశుద్ధాత్ముడు - 2

(గతసంచిక తరువాయి) —పెర్రి గోతమ్

### రక్షణలో దేవుని శక్తి

మనుష్యులను రక్షించుటలో ప్రభువు తన శక్తిని వాక్యము ద్వారా వినియోగించునని బైబిలు విపులీకరించుచున్నది. నమ్ము ప్రతి వానిని రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది: "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడనుకాను, ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగ జేయుటకు అది దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16).

ఈ వాక్యములో రెండు సంగతులు విపులీకరించ బడినవి: 1. రక్షించుటకు సువార్తలో యున్న పరిపూర్ణ శక్తి 2. జాతి, కుల వి క్షత లేకుండ నమ్ము ప్రతివానికొరకు సువార్తలో యున్న సార్వజనీనత్వ

రక్షింపబడుటకు సువార్త ఒక్కటి మాత్రమే మానవునికున్న నిరీక్షణయై యున్నది.

సువార్త దానియొక్క పవిత్రతలోను, సూక్ష్మయతలోను బోధింప బడునప్పుడు అది గొప్ప శక్తివంతమైనదై యుండును. ఆటం బాంబుల కంటె అది ఎంతో శక్తి గలది. అవి పట్టణములను నాశనము చేయును గాని ఆత్మలను రక్షింపజాలవు. మానవాభిప్రాయములు గాని, వేదాంతుల జ్ఞానము గాని ఆత్మలను రక్షించలేవు. సువార్త శక్తిద్వారా దేవుడు మానవులను రక్షించి తన బిడ్డలనుగా చేసికొనును. మార్పు జెందుటలో అదనపుశక్తిని గూర్చి బైబిలు బోధించుటలేదు. నిజముగా క్రీస్తు సువార్త రక్షించుటకు దేవుని శక్తియై యున్నది.

నశించినవారిని రక్షించు నిమిత్తము సువార్తను తప్ప వేరొక దానిని ఆత్మావేశమునొందినవారు సిఫారసు చేయలేదు. మార్పుజేయునట్టి శక్తిని పైనుండి పంపించుమని ప్రజలు ప్రార్థించునప్పుడు సువార్త రక్షించుటకు దేవుని శక్తియైయున్నదని వారు తిరస్కరించుదురు. రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నందునను వాక్యములో సువార్త యున్నందున మార్పుజేయు శక్తిని పైనుండి పంపించుమని ప్రార్థించుట వ్యర్థము. ఒప్పింపజేయు సాధనముగా లేఖనములున్నవని జ్ఞాపకముంచుకొనుము. "ఆత్మ ఖడ్గమైన దేవుని వాక్యము". పరిశుద్ధాత్ముడు లేఖనములకు అదనముగా పాపియొక్క హృదయములో పనిజేయు నవసరములేదు. పాపులు అద్భుతరీతిగా ఆత్మను పొందుదురని బైబిలు బోధించుటలేదు. రక్షింపబడనివాడు సువార్తను విని, విశ్వసించి, దానికి విధేయత చూపవలెను.

## సువార్త—రాజ్యముయొక్క విత్తనము

మార్పుజెందుటకు ఆత్మీయ విత్తనమైన దేవుని వాక్యముయొక్క ఆవశ్యకతను విత్తువాని ఉపమానము మనకు బోధించుచున్నది (లూకా 8:4-15; మార్కు 4:1-20; మత్తయి 13:3-23). భౌతిక

విషయములలో గాని, ఆత్మీయ విషయములలో గాని విత్తనము లేకుండా జీవము ఉత్పత్తి కాదు. క్రైస్తవులను తయారుచేయుటకు విత్తనము అతి ప్రాముఖ్యము. దేవుని రాజ్య "విత్తనము దేవుని వాక్యమని" క్రీస్తు చెప్పెను (లూకా 8:11). భౌతిక రాజ్యములో గోధుమ గింజ యెట్లో అట్లే ఆత్మీయ రాజ్యములో వాక్యము కూడాను. దానిలో జీవము కలదు. విత్తనములు విత్తబడనియెడల కోత యుండదు. సువార్త ప్రకటింపబడనియెడల క్రైస్తవులు ఉండరు. మనుష్యుని హృదయమే పొలము; మానవుడు వినగా విత్తనము దానిలో ప్రవేశించును.

వాక్యమును వినినవారి నుండి దానిని వెంటనే తొలగించుటకు అపవాది ఎందుకు ప్రయత్నించును? దాని శక్తిని అతడెరుగును. విత్తనము నూతన జీవము నుద్భవింపజేయును. రక్షింపబడిన వారందరు ఈ బీజము వలననే మరల పుట్టింప బడినవారని బైబిలు చెప్పుచున్నది (1 పేతురు 1:23). దేవుని వాక్యముద్వారా నూతన జీవితము ఒకని హృదయములో సృష్టింపబడునని ఈ వాక్యభాగము చెప్పుచున్నది. మరల, దేవుని రాజ్యపు విత్తనము అక్షయమైనదనికూడ అది ఉద్ఘాటించుచున్నది. క్షయమైన భౌతిక విత్తనములవలెగాక దేవుని వాక్యము సజీవముగలదియై ఎల్లప్పుడు నిలిచియుండును. "మీకు ప్రకటింపబడిన సువార్త యీ వాక్యమే" యని పేతురు పలికెను (1 పేతురు 1:25).

అపొస్తలులు ప్రకటించిన సువార్త జీవము నుద్భవింప జేయునట్టిది, నాశనము లేనట్టిది. పరిశుద్ధాత్ముడు అద్భుతరీతిగా పాపి హృదయములో పనిచేయువరకు దేవుని వాక్యము కేవలము శక్తిహీనమైనదని చెప్పు దుర్బోధను ఇది ఖండించుచున్నది. ఆదిలో పరిశుద్ధాత్ముడు సువార్తకు అనుగ్రహించిన బ్రదికించే శక్తి ఇంకను దానిలోనే యున్నది. జీవము గలదియై, జీవమిచ్చు విత్తనమైన సువార్తద్వారా పరిశుద్ధాత్ముడు జీవము నిచ్చును. అందువలన బైబిలు ఒక వ్యక్తి

పత్రమేయని అపవాది నమ్మించుటకు ప్రయత్నించును. దాని నతడు సాధించినప్పుడు రక్షింపబడే విధానమును మానవుని నుండి అతడు దొంగిలించును.

జీవన ప్రసాదము మానవ హృదయమునకు మధ్యముగా యున్నది. వృక్షజీవమునుగూర్చి వ్యవసాయకునికి సంపూర్తిగ తెలియక పోయినను విత్తనముద్వారా జీవముద్భవించునని యెరిగి విత్తనమును విత్తును, కృపవిషయములో కూడ ఇది సత్యము. సువార్త మొదట బోధింపబడవలెను. ఈవిత్తనము లేకుండ మార్పు సంభవించదు. ప్రజలెట్లు మార్పు జెందుదురో అపవాది యెరుగును గనుక వారు విశ్వసించి రక్షింపబడకుండునట్లు అది వాక్యమెత్తికొని పోవును. (లూకా 8:12): ఈవాస్తవముల దృష్ట్యా మన ప్రభువు తన అపొస్తలుల కిచ్చిన గొప్ప ఆజ్ఞ ప్రాముఖ్యతను వహించుచున్నది: "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" మార్కు (16:15, 16).

## లేఖనముల శక్తి, వాటి సంపూర్ణత

సువార్తను గూర్చిన మరికొన్ని సత్యములను గమనించుము. దేవుని వాక్యమువలన ఈలోకము సృష్టింపబడెనని లేఖనములు వక్కాణించుచున్నవి. వస్తువుల ఆరంభమునుగూర్చి శాస్త్రజ్ఞులు, వేదాంతులు యుగముల తరబడి తమ ఊహలను ప్రకటించుచున్నారు. ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెనని బైబిలు చెప్పుచున్నది (ఆది 1:1). ఈపనిలో దేవుడు వినియోగించిన సాధనము వాక్యము.

"యెహోవా వాక్కుచేత ఆకాశములు కలిగెను, ఆయన నోటి ఊపిరిచేత సర్వ సమూహములు కలిగెను....ఆయన మాట సెలవియ్యగా దాని ప్రకారమాయెను. ఆయన ఆజ్ఞాపించగానే కార్యము స్థిరపరచబడెను" (కీర్తన 33:6, 9). ఈ విశ్వమంతటిని సృష్టికర్త తన

మాటచేత సృష్టించెను. ఈలోకమెట్లు ఆరంభించెనో చెప్పుట యెవనికిని సాధ్యము కానందున ఈ సత్యమును ప్రతివాడును విశ్వాసము వలన అంగీకరించవలెను. "ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మించబడ లేదనియు విశ్వాసముచేత గ్రహించుకొనుచున్నాము" (హెబ్రీ 11:3).

క్రీస్తు ఈలోకములో యున్నపుడు ఆయన మాటలు శక్తివంతమైనవి. ఆయన చేసిన అద్భుతములన్నియు ఆయన మాటలయొక్క శక్తివలననే చేసెను. ఆయనమాట పలికితేచాలు క్రియ ఆయెను. అట్లే ఆయన బోధకూడాను, ఆయన వాక్యము శక్తితో కూడినదై యుండెను (లూకా 4:32). దేవుని వాక్యము నిష్ఫలముగా ఆయన యొద్దకు మరలక అది ఆయన పంపినకార్యమును సఫలము చేయునని యెషయా పలికెను (యెషయా 55:10, 11). యిర్మియాద్వారా దేవుడిట్లు పలికెను: "నామాట అగ్నివంటిదికాదా? బండను బద్దలుచేయు సుత్తెవంటిదికాదా?" (యిర్మియా 23:29). దేవుడు చెప్పిన యేమాటయైనను నిరర్థకము కానేరదని బైబిలు బోధించుచున్నది (లూకా 1:36). దేవుని వాక్యము ఎల్లప్పుడు శక్తివంతమైనదై యుండెను.

దాని యొక్క కర్తవలె, దేవుని వాక్యము నిత్యమైనది, అది యెన్నటికి గతించదు (యెషయా 40:8; 1 పేతురు 1:24, 25). యేసు ఇట్లనెను: "ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏమాత్రమును గతింపవు" (మత్తయి 24:35). కొందరు చెప్పు రీతిగా బైబిలు మృతమైనది కాదు. గాని అది సజీవమై, బలముగలదై యున్నది. ఆత్మీయ జీవపు శక్తితో అది నిండియున్నది: "దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా యున్నది" (హెబ్రీ 4:12).

మానవ హృదయములోని వాక్యము రక్షించును, బ్రదికించును, మార్పు జేయును. వాక్యములో యున్న దేవుని తలంపులలో శక్తి యున్నది. మనుష్యుని రక్షణార్థము పలుకబడిన దేవుని మాటలో ఎంత శక్తి యున్నదో వ్రాయబడిన దానిలో కూడా అంతే శక్తి యున్నది.

మానవుని జీవమునకు భక్తికి కావలసిన దంతటిని ప్రభువు తన వాక్యములో ఇచ్చి యున్నాడు (2 పేతురు 1:3). మానవుని భక్తి తత్వవిధు లన్నిటికి పరిశుద్ధ లేఖనములు సర్వసంపూర్ణ మార్గదర్శియై యున్నవని బైబిలు చెప్పుచున్నది. రక్షింపబడుటకు ప్రజల కవుసరమైన దేదియు దేవుని వాక్యమునందు ఇయ్యబడకుండ లేదు. ఒకడు పాపలోకమును వీడి ఆత్మయొక్క నిత్యాగృహమగు పరలోకములో ప్రవేశించువరకు నడువ వలసిన త్రోవలో దేవుని వాక్యము నడిపింపని ఒక్క అడుగు కూడ లేదు. గనుక తన ఆత్మ రక్షణార్థము మానవుని కవుసరమైన దంతయు పరిశుద్ధ లేఖనములలో ఈయబడినది. అది ఒక్కటే అతని విశ్వాసమునకు ఆచరణకు ఈయబడిన దైవ మార్గదర్శి. "దైవ జనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమో 3:16, 17).

అంతే కాదు మానవుడు ఎంత పతనమై పోయినను, సువార్తకు లోబడుటద్వారా క్రైస్తవునిగా మారగలడు. త్రాగుబోతులతోను, వ్యభిచారులతోను నిండియున్న కొరింధు పట్టణములో పౌలు సువార్తను ప్రకటించిన సంఘటనను బట్టి, ఘోర పాపులనుకూడ రక్షించుటకు సువార్తలో యున్న శక్తిని మనము సులభముగా గ్రహించుకొన గలము. మార్పు జెందినవారు సాధారణముగా అవినీతిలో మునిగిపోయిన దీనులు. కొంత కాలమైన తరువాత, "సహో

దరులారా, మిమ్మును పిలిచిన పిలుపును చూడుడి. మీలో లోకరీతిని జ్ఞానులైనను, ఘనులైనను, గొప్ప వంశమువారైనను అనేకులు పిలువబడలేదు" అని పౌలు వారికి వ్రాసెను. కొరింథువారి దురలవాట్లను అనగా విగ్రహారాధన, వ్యభిచారము, ఆడంగితనము, త్రాగుబు, దొంగతనము మొదలగు వాటినిగూర్చి చెప్పి, "మీలో కొందరు అట్టివారై యుండిరి గాని, మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున మన దేవుని ఆత్మయందును మీరు కడుగబడి, పరిశుద్ధపరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడిరి" యని పౌలు వారికి తెలియజేసెను (1 కొరింథి 6:11). సువార్త కొరింథీయులను పాపమునుండి రక్షించగలిగిన యెడల, దాని నంగీకరించినవాని నెవనినైనను పాపమునుండి అది రక్షించగలదు. వారి మార్పును వర్ణించుచు, "కొరింథీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి" యని అపొస్తలుల కార్యములలో వ్రాయబడియున్నది (అపొ.కా. 18:8). క్రొత్త నిబంధన అనేకుల మార్పును వర్ణించుచున్నది గాని రక్షించుటలో సువార్తయొక్క శక్తిని నిరూపించుటకు కొరింథీయుల సందర్భము చాలును.

ఆత్మయున్న పాపపుస్థితి ఎంత ఘోరమైనను దేవుని వాక్యము దానిని రక్షించగలదని బైబిలు చెప్పుచున్నది (యాకోబు 1:21). అయితే దేవుని వాక్యమునకు మించినశక్తి అవసరమని కొందరు ఏల చెప్పుదురు? మనుష్యుడున్న రీతిగానే అతడు విధేయుడైన యెడల సువార్తయున్న రీతిగానే అతనిని రక్షించును. బైబిలులో లిఖింపబడిన దేవుని వాక్యము దేవుడుద్దేశించిన కార్యమునంతటిని సాధించుటకు శక్తివంతమైయున్నది. నశించిన వానిని ఈనాడు రక్షించు దేవుని శక్తి సువార్తయందు లేక ఆయన ఉపదేశమునందున్నది. మార్పు జేయుటలో యెహోవా వినియోగించినదంతయు ఇదే.

(సశేషము)

# 3. అద్భుతములు ఆగిపోయెనా?

## *(Have Miracles Ceased)*

గతసంచిక తరువాయి —A. G. హాబ్స్

క్రొత్త నిబంధన కాలంలో అద్భుతములు చేయబడెనను సంగతిని మేము ప్రశ్నించుటలేదు. పేతురు యోహానులు పుట్టినది మొదలుకొని కుంటివాడైన యొక మనుష్యుని స్వస్థపరచిరి. "వెంటనే వాని పాదములును చీలమండలును బలము పొందెను. వాడు దిగ్గున లేచి నడిచెను; నడుచుచు గంతులువేయుచు దేవుని స్తుతించుచు వారితోకూడ దేవాలయములోనికి వెళ్ళెను" (అపొ. కా. 3:7, 8). పేతురు చనిపోయిన స్త్రీని బ్రదికించెను (అపొ. కా. 9:40, 41). పౌలు చనిపోయిన ఒక యౌవనస్థుని బ్రదికించెను (అపొ. కా. 20:9-12). విషసర్పమొకటి పౌలు చేతిని కరచెను గాని దానివలన అతడే హానియు పొందలేదు (అపొ. కా. 28:5).

నిజంగా జరిగిన అద్భుతములలో యివి కొన్ని. ఇటువంటి అద్భుతాలనేమైనా ఈరోజుల్లో నీవు చూచావా? లేదు, నీవుగాని నేనుగాని చూడలేదు. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారు వీటిని, ఇంకా మరికొన్నింటిని చేయ గల్గిరి (మార్కు 16:17,18). ఎవడైనను ఈనాడు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందియుంటే వాడు ఈ అద్భుతములను చేయగల్గును, అతడు చేయలేనియెడల అతడు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందలేదు.

అన్యభాష యనగా మానవులు అర్థము చేసికొనగలిగే వేరొక భాష (అపొ. కా. 2:4-6). తాను నేర్చుకోలేని వేరొక భాషలో ఎవడు ఈనాడు మాట్లాడలేడు. దానిఋజువు: పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందామని చెప్పుకునే మిషనరీలు విదేశాలకు వెళ్ళినప్పుడు వారు తర్జుమాదారుల నుపయోగిస్తారు లేదా ఆదేశభాషను నేర్చు

కొంటారు. గనుక పెంతెకొస్తు సంఘాలవారు చేయునదంతా అర్థరహితమైన అల్లరేగాని అన్యభాష కాదు.

అద్భుతములు ఇప్పుడు లేవు గనుక అవి ఆగిపోయెనని ఋజువగుచున్నది. దాన్ని గూర్చి మనకు లేఖనములనుండి ఋజువుకలదు: "ప్రేమ శాశ్వతకాలముండును. ప్రవచనములైనను నిరర్థకములగును; భాషలైనను నిలిచిపోవును; జ్ఞానమైనను నిరర్థకమగును. మనము కొంతమట్టుకు ఎరుగుదుము, కొంతమట్టుకు ప్రవచించుచున్నాము. గాని పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణముకానిది నిరర్థకమగును" (1 కొరింథీ 13:8-10).

అద్భుతములు ఆగిపోయెనని ఈ లేఖన భాగము ఖచ్చితంగా బోధించుచున్నది. ప్రవచనములు, భాషలు, (అద్భుత) జ్ఞానము ఇవన్నియు ఒకేసారి నిలిచిపోవును. ప్రవచించే వరము కలిగిన మానవుడెవడు భూమిమీద ఈనాడు లేడు. దైవావేశమువలన బోధించగలిగేవాడు, భవిష్యత్ సంగతులను ఖచ్చితంగా చెప్పగలిగేవాడు ఎవడు ఈనాడు లేడు (అపొ. కా. 11:28). దైవావేశము చొప్పున జ్ఞానము కలిగిన వాడెవడు కూడ ఈనాడు లేడు. దేవుని చిత్తాన్ని తెలుసుకోడానికి అందరు దేవుని వాక్యాన్ని చదువవలసినదే. క్రొత్త నిబంధనలో బయల్పరచబడిన సువార్త గాక వేరొక దాన్ని ఎవడైనను బోధించిన యెడల అతడు శాపగ్రస్తుడగును గాక (గలతీ 1:8). ప్రవచించే వరము, జ్ఞానవరము నిలిచిపోయినట్లు ఋజువగుచున్నది. గనుక అన్యభాషలతో మాట్లాడుటయు, మిగిలిన అద్భుతములన్నియు నిలచిపోయెనని మనము ముగింపుకు రావలసియున్నది.

క్రీస్తు పరిపూర్ణుడే గనుక "పూర్ణమైనది వచ్చినప్పుడు" అన్నప్పుడు పౌలు క్రీస్తుయొక్క రెండవరాకడను ఉద్దేశించి చెప్పలేదు. పైన చెప్పుకొనిన వరములు నిలిచిపోయాయి గాని క్రీస్తు ఇంకా

రాలేదు. గనుక ఈవాక్య భాగంలో పౌలు ఆయన రెండవ రాకడను గూర్చి చెప్పలేదు.

దేవుని చిత్తము అప్పటికింకా పూర్తిగా బయల్పరచ బడలేదుగాని ఇప్పుడు అది సంపూర్తిగా బయల్పరచబడి యున్నది. అది మనలను ప్రతి సత్కార్యమునకు సంపూర్ణముగా సిద్ధపరచుచున్నది. (2తిమో 3:16, 17). మనందరము స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమములో తేరిచూడ గల్గుచున్నాము (యాకోబు 1:25). ఆత్మ యొక్క వరముల ప్రయోజనాన్ని ఇప్పుడు పూర్తిగా చూడగలము మరియు అవి ఎందుకు నిలచిపోవలసి యుండెనో గ్రహించుకోగలము.

అద్భుతములు జరిగించబడునని చెప్పిన బైబిలే అద్భుతములు జరిగెనని చెప్పుచున్నది. అదే బైబిలు అద్భుతములు ఆగిపోవునని కూడ చెప్పుచున్నది. ఈ అద్భుతవరములు ఆగిపోవునని దేవుడు చెప్పు చున్నప్పుడు అవి సంఘములో కొనసాగించబడునని ప్రయత్నించుట దేవునిపైకి తిరుగుబాటు చేయుటయే. అపొస్తలులు అద్భుతములు చేసిరి. వారు ఇతరులపై చేతులుంచి వారికి ఆత్మీయవరముల నందియ్యగల్గిరి (అపొ.కా. 8:14-18). అపొస్తలులనుండి ఈ ఆత్మీయ వరములను పొందినవారు వేరొకరికి వాటిని అందియ్యలేకపోయిరి. గనుక అపొస్తలులు చనిపోయినప్పుడు, వారి చేతులద్వారా అద్భుతముల నందుకొన్న వారందరు చనిపోయినప్పుడు అద్భుతములు అప్పుడు అక్కడ ఆగిపోయెను.

## అబద్ధ సూచకక్రియలు, మహత్కార్యములు

ప్రజలను మోసగించుటకు అబద్ధ సూచకక్రియలు ఉపయోగింపబడునని పౌలు ప్రకటించెను. "అప్పుడా ధర్మవిరోధి బయలు పరచబడును...వాని రాక అబద్ధవిషయమైన సమస్త బలముతోను, నానావిధములైన సూచకక్రియలతోను మహత్కార్యములతోను... సమస్త మోసముతోను నశించుచున్నవారిలో సాతాను కనపరచు బలమును అనుసరించి యుండును" (2 థెస్స 2:8-10).

ఈ నాడు జరుగుచున్నవి నకిలీ యద్భుతములు మాత్రమే, అవి అబద్ధ సూచకక్రియలు. వివేకియైన మానవుడెవడు తనకు ఆ శక్తిని ఉన్నదని చెప్పుకొనడు. వారు సత్యమును ప్రేమింపనందువలన వారందరు శిక్షావిధి పొందుటకై అబద్ధమును నమ్మునట్లు మోసము చేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు (2 థెస్స 2:11, 12). "నీ వాక్యమే సత్యము" అని యేసు చెప్పెను. దేవుని వాక్య సత్యమును ప్రేమింపక, నమ్మక, దాని చొప్పున నడువనేరక యుండువారికి నిరీక్షణ యేమియూ లేదు. ఈ నాడు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందామని చెప్పుకొను వారందరు వారి ఊహలకొరకు, అభిలాషలకొరకు దేవుని వాక్యమును నిరాకరించుచున్నారు, లేదా కలుషితము చేయుచున్నారు.

అన్యభాషలతో మాట్లాడుదుమని వారు చెప్పుకొంటారు. గాని భాషలంటే మానవులు అర్థము చేసికోగలిగే భాషలని బైబిలు చెబుతుంది. (అపొ. కా. 2:4-6). సభలో యున్నవారు అర్థము చేసికోలేని భాషతో మాట్లాడుట అద్భుతవరములు ఈయబడుచున్న రోజుల్లోనే ఖండించబడింది. (1 కొరింథి 14:19). అన్యభాషలు మాట్లాడుచున్నామనేవారు మాట్లాడేది రణగొణ ధ్వనియేగాని ఒకభాషకాదు. వారు నిజంగా భాషలు మాట్లాడేవారయితే విదేశాలకు వెళ్ళి అక్కడివారి భాష నేర్చుకోకుండగనే వారితో మాట్లాడవచ్చునుగదా; అయితే వారట్లు చేయలేరు.

ఇప్పుడు మూడు బాప్తిస్మములున్నవని వారు చెప్పుచుందురు. గాని ఇప్పుడు ఒకేఒక్క బాప్తిస్మమున్నదని బైబిలు చెప్పుచున్నది (ఎఫెసీ 4:5). అది నీటిలో బాప్తిస్మము (1 పేతురు 3:20, 21).

## నకిలీ అద్భుతములు

అద్భుత స్వస్థత జరుగుట మేము చూచామని కొందరు దృఢముగా వక్కాణిస్తారు. సాధరణంగా ఈ 'స్వస్థతలన్నీ' పైకి కనబడకుండా లోలోపల ఉన్న వ్యాధిరోగాలకే జరుగుచుండునని నీవు గమ

నించావా? గుడ్డివాళ్ళెవరు, కుంటివారెవరు, కుష్ఠురోగు లెవరు ఈ స్వస్థత కూటాలలో బాగుపడరు. ఎందువలన? ఈస్వస్థత వరము కలిగిన భక్తుడెవడు నిజంగా విరిగిన యే చిన్న యెముకను బాగుచేయలేడని ఛాలెంజీ యిస్తున్నాను.

అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిన తరువాత వారు ఎవరినైనా స్వస్థపరచుటలో అపజయము పొందినట్లు ఎక్కడా కనబడుటలేదు. అపొస్తలులు "రోగులమీద చేతులుంచినప్పుడు వారు స్వస్థత నొందుదురని" యేసు వారికి వాగ్దానము చేసెను (మార్కు 16:18). స్వస్థత వరమున్నదని చెప్పుకొనేవారు ఎవరినైనా స్వస్థపరచ లేకపోయేసరికి, ఆరోగికే సరిపడినంత విశ్వాసము లేదని చెప్పును. యేసు వ్యక్తిగత సువార్తసేవచేయు కాలంలో అపొస్తలులు ఒకసారి విఫలు లైరి. వారి అపనమ్మకమునుగూర్చి యేసు వారినే గద్దించెను గాని రోగియైన బాలునికాదు (లూకా 10:41).

అవును, దేవుడు ప్రార్థనలకు జవాబు నిచ్చును. ఆయన చిత్తమును జరిగించువారి ప్రార్థనలకే జవాబిచ్చుటకు ఆయన వాగ్దానము చేసెను. (యోహాను 9:31). పెంతెకొస్తు శాఖవారు, వారి యుల వాట్లు ననుకరించే వారందరు దేవుని సువార్తకు లోబడలేదు. గనుక వారాయన బిడ్డలు కాదు. వారాయన చిత్తమును జరిగించుటకు నిరాకరింతురు. దేవుడు మన ప్రార్థనలకు జవాబిచ్చుట ఒక అద్భుతముకాదు: ఆయన తన మహోచితకృపనుబట్టి ప్రార్థనలకు జవాబీయ వచ్చును. అందునిమిత్తం ఆయన అద్భుతాలనేమి జరిగించ నవుసరం లేదు.

ఒకబోధకుడు అబద్ధికుడో సత్యవంతుడో పరిశోధించుట దేవుని శోధించుట కానేరదు (1యోహాను 4:1; ప్రక 2:2). నీబోధకుని పరీక్షించుము. తాను చేయగలనని చెప్పుకొన్నవి చేయలేనప్పుడు, తన కున్నవని చెప్పుకొన్నవి అతనికి లేనప్పుడు అతడు అబద్ధబోధకుడని నిర్ధారణయగును. అతడు క్రొత్తనిబంధనను బోధించి, దానిప్రకారము

ఆరాధించని యెడల అతడు ఎంతభక్తిగలవానిగా కన్పడుచున్నను, అబద్ధబోధకుడే. అతడు నిన్ను పెడత్రోవను పెట్టుచున్నాడు; అతని విసర్జించుము.

క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" (రోమా 16:16)

(సమాప్తము)

## 4. యోసేపుకు విరుద్ధముగా మరియ!

## *( Joseph Vs. Mary! )*

"యేసుక్రీస్తు జననవిధ మెట్లనగా, ఆయన తల్లియైన మరియ యోసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాక మునుపు ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా ఉండెను. ఆమె భర్తయైన యోసేపు నీతిమంతుడై యుండి ఆమెను అవమానపరచ నొల్లక రహస్యముగా ఆమెను విడనాడ ఉద్దేశించెను" (మత్తయి 1:18,19).

యూదుల చట్టప్రకారము యోసేపు మరియను విడనాడే హక్కును కలిగియుండుట మాత్రమే గాక ఆమెను బహిరంగముగా విచారణ చేయించవచ్చును. అతడామెను బహిరంగముగా అవమానపరచ నొల్లక ఆమెను విడిచిపెట్టుటకు ఆలోచించుచుండెను. అతడీ సంగతినిగూర్చి ఆలోచించుకొనుచుండగా ప్రభువు దూత స్వప్నమందు అతనికి ప్రత్యక్షమై మరియ గర్భము నెట్లు ధరించెనో చెప్పెను. అయితే యోసేపు మరియను విచారణకు అప్పగించిన యెడల ఆ కేసును ఎవరు జయించియుండును?

ఆ కేసు ద్వితీయోపదేశకాండము 22:13-21 లో వ్రాయబడిన పాత నిబంధన చట్టప్రకారము విచారించబడవలెను. ఆశాసనము ఇట్లున్నది: "ఒకడు స్త్రీని పెండ్లిచేసుకొని ఆమెను కూడిన తరువాత ఆమెను ఒల్లక ఆమెమీద అవమాన క్రియలు మోపి, ఆమె చెడ్డదని ప్రచురపరచి-ఈ స్త్రీని నేను పరిగ్రహించి యీమెదగ్గరకు వచ్చినప్పుడు ఆమె

యందు కన్యాత్వము నాకు కనబడలేదని చెప్పినయెడల ఆ చిన్నదాని తలిదండ్రులు ద్వారమందున్న ఆ ఊరి పెద్దలయొద్దకు ఆ చిన్నదాని కన్యాత్వ లక్షణములను తీసికొని రావలెను. అప్పుడు ఆ చిన్నదాని తండ్రి-నాకుమార్తెను ఈమనుష్యునికి పెండ్లిచేయగా ఇదిగో ఇతడీమె నొల్లక-నీకుమార్తెయందు నాకు కన్యాత్వము కనబడలేదనియు, అవమాన క్రియలు చేసినదనియు ఆమెమీద నిందమోపెను; అయితే నా కుమార్తె కన్యాత్వమునకు గురుతులివే అని పెద్దలతో చెప్పి పట్టణపు పెద్దలయెదుట ఆబట్టను పరచవలెను. అప్పుడు ఆఊరి పెద్దలు ఆమనుష్యుని పట్టుకొని శిక్షించి నూరు వెండితూకలు అపరాధముగా వాని యొద్ద తీసుకొని ఆచిన్నదాని తండ్రికియ్యవలెను. ఏలయనగా అతడు ఇశ్రాయేలీయుల కన్యకను అవమాన పరచియున్నాడు. అప్పుడామె అతనికి భార్యగా యుండును; అతడు తాను బ్రదుకు దినములన్నిటను ఆమెను విడువకూడదు. అయితే ఆమాట నిజమైనయెడల, అనగా ఆ చిన్నదానియందు కన్యకాలక్షణములు కనబడనియెడల వారు ఆమె తండ్రియింటియొద్దకు ఆచిన్నదానిని తీసికొని రావలెను. అప్పుడు ఆమె ఊరివారు ఆమెను రాళ్ళతో చావగొట్టవలెను. ఏలయనగా ఆమె తన తండ్రియింట వ్యభిచరించి ఇశ్రాయేలీయులలో దుష్కార్యము చేసెను. అట్లు ఆచెడుతనము మీమధ్యనుండి మీరు పరిహరించుదురు."

యోసేపు గనుక మరియను విచారణకు అప్పగిస్తే అతడే ఓడిపోవును! మరియ తలిదండ్రులు ఆమె కన్యాత్వగురుతులను చూపించి ఆమె కన్యయే యని నిరూపించియుండును. ఒక చిన్నది గర్భముధరించి కూడా కన్యకయై ఎట్లుండును? మరియ దాల్చిన గర్భము అసాధారణమైనది.

"దావీదు కుమారుడవైన యోసేపూ, నీభార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము, ఆమెగర్భము ధరించినది పరిశుద్ధాత్మవలన కలిగినది. ఆమెయొక కుమారుని కనును...ఆయనకు యేసు అను

పేరు పెట్టుదువు. ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును. ఆయ నకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్తద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను" (మత్తయి1:20-23).

యేసు పుట్టేవరకుకూడ మరియు ఏపురుషుని కూడలేదు. అటు తరువాత ఆమె తన భర్తయైన యోసేపును ఎరిగియుండెను (మత్తయి 1:25). ఆమె గర్భము ధరించుట ఒక అద్భుతము. ఆమెవలె ఎవరు గర్భము ధరించలేదు. ధరించబోరుకూడ. యేసుయొక్క జననము, జీవనము, మరణము, పునరుత్థానములు అద్వితీయమైనవి. ఆయనే దేవుని ఏకైక కుమారుడు (యోహాను 3:16).

అవును, యోసేపు గనుక మరియను విచారణకు అప్పగి[ంచినయెడల] పెద్దలు అతన్నే శిక్షించి, నూరు వెండిరూకలు అతనినుండి అపరా[ధ]ముగా తీసికొని మరియ తండ్రికి ఇచ్చియుందురు. అతడు ఈ కేసులో ఓడిపోయి ఉండును.

— రేహా[బు]

---

## 5. మంటి ఘటములలో ఐశ్వర్యము

### *(Treasures in Earthen Vessels)*

మానవుడు దేవునికి విధేయుడై యుండాలని ఆయన కోరెను. కొన్ని సంగతులు వినాయించి మానవుని చరిత్ర అంతా అవిధేయతే. మానవుని తిరిగి దేవుని మార్గానికి తీసుకొని వచ్చుటకు నోవహు యొక్క ప్రియత్నమైయుండెను. అతనిపని చాలమట్టుకు విఫలమాయెను. మానవుడు నాశనము గావించబడెను.

సీనాయి దగ్గర దేవుడు ఇశ్రాయేలుకు ఒక ధర్మశాస్త్రము నిచ్చెను. పదియాజ్ఞలుగల రెండు రాతిపలకలను పట్టుకొని మో[షే]

ఆ కొండదిగిరాకముందే వారు దేవునిపై తిరుగుబాటు చేసారు. తమ అవిధేయతవలన కలుగు ఫలితములను గూర్చి ఇశ్రాయేలీయులను హెచ్చరించుటకు దేవుడు ప్రవక్తలను పంపెను. వారు ధర్మశాస్త్రాన్ని గాని ప్రవక్తల మాటలనుగాని విననందున వారు చెరలోనికి వెళ్ళిరి. శిక్షించబడిన ప్రజలుగా చెరనుండి తిరిగి వచ్చిరిగాని దేవుని చిత్తానికి వారుపూర్తిగా లోబడలేక పోయిరి. మనము హగ్గయి, జెకర్యా, మలాకీ గ్రంథములు చదివినయెడల వారి తిరుగుబాటు ఇంకా ప్రబలి యుండెనని గమనించగలము.

## విధేయత అవుసరం

ప్రభువు ఈభూమిని ఒకశాపముగా మార్చకముందు పిల్లల హృదయాలను తండ్రులవైపు, తండ్రుల హృదయాలను పిల్లలవైపు మార్చుటకు బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చెను. యోహాను చేసే ప్రసంగము ఒకే ఒక్కటని చెప్పబడెను - అది మానవులు మారు మనస్సు పొందవలెననునది. అతని బోధ విద్వాంసనీయమైనది కాదు. రాజు తన సహోదరుడగు ఫిలిప్పు భార్యతో జీవించుట తప్పు అని అతడు అతనికి చెప్పెను. యీ గందరగోళమువలన అతడు చంపబడెను.

యోహాను ఎక్కడ విడిచిపెట్టెనో అక్కడనుండి యేసు బోధించుట కారంభించెను: మారు మనస్సుపొందుడి, దేవుని రాజ్యము ఆసన్నమై యున్నది. వారు పైకి లోబడుచున్నట్లు కనబడుచున్నను, దేవుని యెదుట వారి హృదయము మంచిదికాదని యేసు తన కాలము నాటి ప్రజలకు బోధించెను. మానవజాతి యంతటికి రక్షణను అందించు నిమిత్తము యేసు దేవుని సంకల్పమువలన మరణించెను. మానవుని విధేయతను దేవుడు ఎల్లప్పుడు కోరెను. క్రొత్తనిబంధన చట్టము అంతకు ముందున్న దానికంటె ఎక్కువ కృపకలిగినదే అయినను, మానవుడు విధేయత చూపించవలెనను వాస్తవాన్ని అది మార్చదు. దీన్ని కనుబుచే కొన్ని లేఖనాలను ఇప్పుడుచూద్దాం: "కుమారునియందు

విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును" (యోహాను 3:36). "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరించని వాడు; ఆబోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు" (2 యోహాను :9).

## దేవుని హెచ్చరికలు

మానవ హృదయాన్ని దేవుడెరుగును, ఎన్ని హెచ్చరికలిచ్చినను మానవుడు దేవుని చట్టానికి తిరుగుబాటు చేయునని ఆయన ఎరుగును. ఇది యథార్థమని కనబరచు అనేక వచనాల్లో రెండువచనములను ఇక్కడ చూద్దాం: "నేను వెళ్ళిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్ళు మీలో ప్రవేశించునని నాకు తెలియును; వారు మందను కనికరింపరు. మరియు శిష్యులను తమవెంట ఈడ్చుకొని పోవలెనని వంకరమాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలు దేరుదురు" (అపొ. కా. 20:29-30). మానవుడు ఇట్లుండాలని దేవుడు కోరలేదు. గనుక పౌలు ఇట్లనుచున్నాడు: "కావున నేను మూడు సంవత్సరములు రాత్రింబగళ్లు కన్నీళ్లు విడుచుచు ప్రతి మనుష్యునికి మానక బుద్ధి చెప్పితినని మీరు జ్ఞాపకము చేసికొని మెలకువగా ఉండుడి" (అపొ. కా. 20:31). తరువాత మనమీలాగు చదువగలము: "మరియు అబద్ధ ప్రవక్తలు ప్రజలలో ఉండిరి. అటువలెనే మీలోను అబద్ధబోధకులుందురు; వీరు తమ్మును కొనిన ప్రభువునుకూడ విసర్జించుచు తమకు తామే శీఘ్రముగా నాశనము కలుగ జేసుకొనుచు, నాశనకరమగు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధించుదురు" (2 పేతురు 2:1). ఈ విశ్వాస భ్రష్టత్వము ఏమీ చిన్నదికాదు. "మరియు అనేకులు వారి పోకిరిచేష్టలను అనుసరించి నడుతురు; వీరిని బట్టి సత్యమార్గము

దూషింపబడును" (2 పేతురు 2:2). సత్యమంటూ యేమీ లేదని కొందరు చెప్పేవరకు ఈ తిరుగుబాటు ఈనాటికిని యున్నది.

ఆరు వేల సంవత్సరములనాటి సంఘటనలు దేవుని ధర్మశాస్త్రము నకు అవిధేయత చూపుట బుద్ధిహీనతే యని మనకు తెలియబరుచు చున్నవి. దేవుని హెచ్చరికను వినుము: "వారు అధికలోభులై కల్పనా వాక్యములు చెప్పుచు మీవలన లాభము సంపాదించుకొందురు; వారికి పూర్వము నుండి విధింపబడిన తీర్పు ఆలస్యము చేయదు, వారి నాశ నము కునికి నిద్రపోదు" (2 పేతురు 2:3).

## పునరుద్ధరణ వాణి

ధర్మవిరోధ సంబంధమైన మర్మము అప్పటికే పనిచేయుచున్న దని పౌలు హెచ్చరించాడు (2 థెస్స 2:7). ఈ ప్రవచనములు ఎంత యథార్థమో చరిత్రను ఒకమారు పరిశీలిస్తే తెలియును. అయితే అనేక మారులు ఖడ్గమైనను, అగ్నియైనను సరే పునరుద్ధరణ వాణి పూర్ణముగా నాశనము గావించబడనందున మనము సంతోషించ గలము. ఈ ప్రయత్నముల యొక్క కథనము అనేకసార్లు చెప్పబడింది. 18వ శతాబ్దముయొక్క ఆఖరిభాగంలోను, 19వ శతాబ్దంయొక్క మొదటిభాగంలోను క్రొత్త నిబంధనలో బయల్పరచబడిన దేవుని మార్గమునకు మానవులు మరలవలెననెడి నినాదము అనేక చోట్ల అనేక ప్రజల మధ్య లేచినందున దేవునికి మనము కృతజ్ఞత చెల్లించాలి. అట్టి ఉద్యమము దేవుని సంతోషపరచునుగాని సాతానుశక్తులను కల వరపరచును. "బైబిలు మాట్లాడుచోట మేము మాట్లాడుదుము, బైబిలు మౌనియగుచోట మేము మౌనులగుదుము. బైబిలు సంగతు లను బైబిలు పేర్లతోనే పిలుచుదుము, మేము కేవలము క్రైస్తవు లము, క్రైస్తవులము మాత్రమే" అను నినాదములు దేశదేశాలలో వినబడింది. వందలకొలది, వేలకొలది ప్రజలు ఈ ఉద్యమానికి చేయూత నిచ్చారు. అయినను సరే క్రొత్త నిబంధన క్రైస్తవ్యానికి

తిరిగి వెళ్ళుటకు అనేకులు యిష్టపడుటలేదు. మరియు మన శారీరక బలహీనతలవలన ఈ ప్రయత్నము కొనసాగుచు యుండాలి. తానింకా పరిపూర్ణత సాధించలేదని పౌలు చెప్పెను. మనము క్రీస్తునకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత కలవారమగువరకు కొనసాగుచు యుండవలెనని మనము గమనించాలి. పరిశుద్ధాత్మని ఈ పలుకుల కంటె మనగమ్యాన్ని ఇంకెట్లు వర్ణించగలము: "క్రీస్తు మీ హృదయములలో విశ్వాసముద్వారా నివసించునట్లుగాను, తన మహిమైశ్వర్యము చొప్పున మీకు దయచేయవలెననియు, మీరు... ప్రేమయందు వేరుపారి స్థిరపడి, సమస్త పరిశుద్ధులతో కూడ దాని వెడల్పు పొడుగు లోతు ఎత్తు ఎంతో గ్రహించుకొనుట, జ్ఞానమునకుమించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును తగిన శక్తిగలవారు కావలెనని ప్రార్థించుచున్నాను" (ఎఫెసీ 3:17-19). మనం పరిపూర్ణతను సాధించలేదు గాని, దాన్ని సాధించేవరకు ముందుకు సాగిపోవుదము.

—జె. సి. బెయిలీ.

---

యేసును వెంబడించిన పండ్రెండుగురు-9

## అల్ఫాయి కుమారుడగు యాకోబు : తెలియబడని సాక్షి

## *(James, Son of Alphaeus : The unknown Witness)*

ఒక జనాంగము మధ్య అందరికీ కనబడేలాంటివాడు అల్ఫాయి కుమారుడగు యాకోబు కాదు. చరిత్రోత్సవములో ముందుండి నడిపించే తరణం అతనిది కాదు. అందరికంటే దీన స్థానాన్ని అంగీకరించి దానిలో పరిపూర్ణ సౌందర్యాన్ని, పరిశుద్ధతను, సమైక్యతను కనుగొనుచు ప్రేమలోను, మంచితనములోను, దేవుని సేవలోను సంతోషపడే వ్యక్తి యతడు.

ఈ అపొస్తలుని గూర్చియున్న రికార్డు స్వల్పమే. అపొస్తలుల యొక్క నాలుగు పట్టికలలోను అతని పేరు మనకు కనబడు

చున్నది. అతడు బహుశ మత్తయి సహోదరుడు కావచ్చును. మత్తయి కూడ అల్ఫయి కుమారుడే (మత్తయి 9:9; మార్కు 2:14). అయితే వీరిద్దరి పేర్లు జంటగా ఎక్కడా కనబడవు. అతడు మరియ కుమారుడైన చిన్న యాకోబు అనియు, యోసే అనువాని సోదరుడనియు గుర్తించబడింది (మార్కు 15:40; మత్తయి 27:56). అయినను సువార్తలలో కనబడు అనేక మరియలు, యాకోబులు, యోసేపులను బట్టి వీరిని ఖచ్చితంగా గుర్తించడం కష్టం. ఇతడు ప్రభువు సహోదరుడైన యాకోబు అనికూడా కొందరు చెబుతారు గాని అది నిరూపించదగినది కాదు. అపొస్తలుల కార్యములలో మొదటి అధ్యాయంలో అపొస్తలు లందరినిగూర్చి చెప్పినప్పుడుతప్ప ఈయాకోబు క్లుప్తముగా కనబడి అటు తరువాత మరుగైపోయాడు. అతడు పర్షియాలో సిలువ వేయబడి హతసాక్షి అయ్యాడని పూర్వీకుల సాంప్రదాయాన్ని బట్టి తెలియుచున్నది.

## స్వాభావిక ప్రశ్నలు

యాకోబులాంటి వ్యక్తిపై అనేక ప్రశ్నలు స్వాభావికంగా కురియవచ్చు...మానవునికి దీవెనకరంగా యుండుటకు పంపబడిన యితడు, ఘనుడేగాని దీనుడైన యితడు ఏలాంటివాడు? అతడు ఎట్టి ధైర్యసాహసాలను కలిగి యుండెను? మన బలహీనతలలో వేటిని అతడు కలిగియుండెను? అతడు జయించిన పోరాటము లేమిటి? ఓడిపోయిన వేమిటి? అతడు కృషిసల్పిన ప్రదేశమేమిటి? స్థాపించిన సంఘాలేమిటి? రారాజు పాదములయొద్ద అతడు సమర్పించేవి జయ చిహ్నము లేమిటి?

## మౌన విజేయులు

మనకు జవాబు దొరుకని ఈ ప్రశ్నలనుబట్టి మేఘమువలె మనలను ఆవరించియున్న గొప్పసాక్షి సమూహములో యాకోబు ఒకడని మనకు గ్రహింపవుచున్నది. ఈసాక్షిసమూహాన్ని దేవుడుమాత్రమే ఎరుగును. తన వలల దగ్గరనుండి పేతురును పిలిచిన స్వామే ఈ యాకోబునుకూడ పిలిచింది. 'పరిశుద్ధాత్మ పొందుడి' యని చెప్పి యేసు అపొస్తలులపై

ఊదినవారిలో ఇతడున్నాడు. యోహానువలె ఆయన మహిమను ఇతడు కూడా చూడగలిగాడు. పునరుత్థానుడైన ప్రభువు వారితో కలసి తిని త్రాగినప్పుడు ఇతడు ఉన్నాడు, అయితే ఈ యాకోబు దేవునికి మాత్రమే తెలిసిన ప్రదేశంలో ప్రభువు కొరకు ప్రకాశించుటకు పర లోక వెలుగుతో బయలు వెళ్లెను.

ఏవిధమైన ఆడంబరములేక ప్రభువు పనిని చేసికొనిపోయే పరిశుద్ధులలో ఈయాకోబు ఉండుట ఎంతసంతోషము! పేరు ప్రఖ్యాతులను గాంచిన వారియెడల వీరు ఎన్నడు మత్సరము కలిగియుండలేదు. వారిదృఢ విశ్వాసము, సంపూర్ణసమర్పణ జీవితంవలన "నాతండ్రిచేత ఆశీర్వదించబడిన వారలారా రండి" యని పిలువబడుదురు. మన విశ్వాసానికి పునాదివేసిన వారిలో యాకోబు ఒకడు (ఎఫెసీ 2:20). గనుక పరలోక పట్టణ ప్రాకారపు పండ్రెండు గుమ్మములలో ఒకదానిపై యాకోబు నామము అగుపడును (ప్రకటన 21:14).

—రాబర్ట్ లారెన్స్

---

Regd. No. H/KD-45/KDH.O.

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA-533 001

To

..............................
..............................
..............................
..............................